శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## కంటైనర్ టర్మినల్‌ను మూసివేయడం లేదు



**ముత్తుకూరు, జనవరి28, ప్రభాతవార్త** ఆదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ తన కంటైనర్ కార్యకలాపాలను మూసివేసే దానిని కట్టుపల్లి పోర్టుకు మారుస్తున్నట్లు ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలను ఆదాని కృష్ణపట్నం పోర్టు తరుపున పోర్టు సీఈవో జిజెరావు ఖండించారు. ఆదివారం కృష్ణపట్నం పోర్టులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాని ఓడరేవులు, ప్రత్యేక ఆర్థిక మండలి గత కొన్ని సంవత్సరాలుగా అద్భుతమైన వృద్ధి సాధిస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు కూడా వృద్ధి వాటాలో తన వ్యాపారాన్ని క్రమంగా పెంచుకుంటూ ఉంది. మా కంటైనర్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నామని మరియు రాబోయే సంవత్సరాల్లో వాటిని మరింత బలోపేతం చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు ఆదాని గ్రూప్‌లో చాలా ప్రధానమైన పోర్టు ప్రతి ఏడాది తన కార్యకలాపాలను విస్తరించడంతోపాటు మరింత బలోపేతం చేయడంలో నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు ఆయన వివరించారు. భవిష్యత్తులో కూడా కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టర్మినల్‌నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆదాని గ్రూపులో ఉద్యోగుల ద్వారా నడిచే సంస్థని అందువలన ఉద్యోగులను తొలగించడం సమస్య ఉత్పన్నం కాదని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం మోడల్‌లో భాగంగా మేము ప్రభుత్వానికి ఆదాని వాటాను క్రమం తప్పకుండా చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతూ ఉందన్నారు. కృష్ణపట్నం పోర్టు అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని వాతావరణ స్థితిలో పోర్టు తన సేవలను అందిస్తున్న కృష్ణపట్నం పోర్టు లోతైన నౌకాశ్రయం దీంతో పెద్దపెద్ద నౌకలు పోర్టులో కార్యకలాపాలు నిర్వహించేందుకు అనువైన పోర్టు అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రైలు రోడ్డు మార్గాలకు అనువైన పోర్టుని ఆయన వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కంటైనర్ టర్మినల్‌ను తరలించే ప్రసక్తే లేదని మరోసారి మీ ద్వారా తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## టిప్పర్ ఢీకొని జార్ఖండ్ యువకుడు మృతి



**సైదాపురం, జనవరి 28, ప్రభాతవార్త** స్నేహితులతో కలిసి రహదారిపై నడిచి వస్తుండగా అతి వేగంగా ఓ టిప్పర్ వచ్చి ఓ యువకుడిని ఢీకొన్న సంఘటన సైదాపురం మండలంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. యువకుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు జార్ఖండ్ రాష్ట్రం అజూర్‌బాద్ జిల్లా కేసత్ గ్రామానికి చెందిన బ్యేయస్ కుమార్(17) తన అన్న, అలాగే కొంత మంది స్నేహితులతో కలిసి సైదాపురం సమీపంలోని ఓ మైన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు దినం కావడంతో తెల్లవారుజామున స్నేహితులతో కలిసి మైన్ వద్ద నుండి సిద్దలయ్యకోన రోడ్డు వద్ద నడుచుకుంటూ వివిధ అవసరాల కోసం సైదాపురంకు వస్తుండగా అదే క్రమంలో సైదాపురం నుంచి ఊటుకూరుకు వెళ్తున్న ఏపీ 39 ఎక్స్ 5342 అనే టిప్పర్ సిద్దలయ్యకోన రోడ్డు సమీపంలో అతి వేగంగా వచ్చి బ్యేయస్‌కుమార్‌ను ఢీనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్నేహితులు ఆటోలో గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. టిప్పర్ నడుపుతున్న డ్రైవర్ మద్యం సేవించి అతి వేగంగా వచ్చి తన తమ్ముడిని ఢీకొనడంతో మృతిచెందాడని మృతుని అన్న సీతారాం తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు కూడా సమాచారం అందించామని అన్నాడు. దీంతో సైదాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజల అవసరాలకనుగుణంగా పనిచేస్తున్న ప్రభుత్వం




**ఆత్మకూరు, జనవరి28, ప్రభాతవార్త :** ఆత్మకూరు-ఉదయగిరి నియోజకవర్గాలను కలుపుతూ ముఖ్యమైన రోడ్డు నిర్మాణానికి నెల్లూరు పాళెం వద్ద ఆదివారం స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైసిపి పరిశీలకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు శంఖుస్థాపన గావించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఆత్మకూరు , ఉదయగిరి నియోజకవర్గాలను కలుపుతూ ఆత్మకూరు నుండి వింజమూరు వరకు ఉన్న రోడ్డును సుమారు 9కోట్ల రూపాయల నిధులతో నిర్మించేందుకు ప్రారంభించారు. ప్రభుత్వం ఇప్పటివరకు ప్రజలకు కావాల్సిన ఎన్నో అభివృద్ధి పనులను, సంక్షేమపథకాలను చేపట్టినట్లు అందులో భాగంగానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల లోపే ఈ రోడ్డును నిర్మించేందుకు పనులు వేగవంతంగా చేస్తున్నామని త్వరగా రోడ్డు నిర్మించి రెండు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన వైసిపి నేతలు, స్థానిక రోడ్డు భవనాల శాఖ , ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రగతికే మెరుగు - విజయానికి మెరుగు



**వింజమూరు, జనవరి28, ప్రభాతవార్త :** 10వ తరగతి విద్యార్థుల్లో ప్రగతి మెరుగు పదంగా ఉండాలని , విజయం పరుగులుతీయాలని జిల్లా బిసి సంక్షేమాధికారి వై.వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ పునశ్చరణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా 10వ తరగతి పరిక్షలు మార్చి నెలలోనే జరగనున్నాయని , పరిక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలన్నారు. పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని బాగా చదివి పునశ్చరణ చేసుకోవాలన్నారు. అలా చేస్తే విద్యార్థులకు సబ్జెక్టు గుర్తు ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తుందని విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజ్ రీయంబర్స్‌మెంట్ అమలు చేస్తూ విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారుల ప్రతిభను వెలికి తీస్తున్నారన్నారు. లక్ష్యసాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. కృషి, పట్టుదల ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. ఈకార్యక్రమంలో ఎబిసి అధికారి కె.సుధాకర్, కళాశాల ప్రిన్స్‌పాల్ ప్రద్మనాభరావ్, సంక్షేమాధికారుల సంఘం కార్యదర్శి ఎ.సాల్మాన్ రాజప్రియ , అసోసియేట్ ప్రెసిడెంట్ రవికుమార్, సంక్షేమాధికారులు పి.వెంగళరావ్, షేక్ రియాజ్, ఎ.శ్రీలత , కావలి డివిజన్ వసతిగృహ సంక్షేమాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లూరు చంద్రబాబు సభ అట్టర్‌ఫ్లాప్



**నెల్లూరు రూరల్, జనవరి 28, ప్రభాతవార్త** నెల్లూరులోని తన కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన టీడీపీ నేతలపై విమర్శలతో విరుచుకుపడ్డారు. చంద్రబాబు సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని విమర్శించారు. 5000 కుర్చీలు వేస్తే అవి కూడా నిండని పరిస్థితి ఆ పార్టీ ఉందని ఎద్దేవ చేశారు. ఈ సభను చూస్తే చంద్రబాబు గ్రాఫ్ ఎంత పడిపోయిందో అర్థం అవుతుందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. చంద్రబాబు ప్రసంగానికి ప్రజల్లో స్పందన కురువవైందని అన్నారు. వైసీపీపై విమర్శలు చేస్తున్న చంద్రబాబు దమ్ముంటే వ్యవసాయరంగంపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. 2019 ఎన్నికల ఫలితాలే మరోసారి నెల్లూరు జిల్లాలో రిపీట్ అవుతాయని దీమా వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. అలాగే మాజీ మంత్రి సోమిరెడ్డినినాలుగు సార్లు సర్వేపల్లి ప్రజలు తిరస్కరించినా చంద్రబాబునాయుడు పక్కనే పెట్టుకుని ఉన్నారని ఎద్దేవ చేశారు.

## రా కదిలిరా సభకు తరలివెళ్లిన కావలి టిడిపి నేతలు



**కావలి, జనవరి 28 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరులో నిర్వహించిన 'రా కదిలిరా' బహిరంగ సభకు ఆదివారం టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఈ నియోజకవర్గం నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలు భారీగా పలు వాహనాలలో తరలివెళ్లారు. సభకు పెద్దఎత్తున తరలివచ్చిన టిడిపి నేతలకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లాలో అన్నిస్థానాలు మనవే

### ఫ్యాను రెక్కలు విరిచేందుకు సిద్ధం

### మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు





**నెల్లూరు జనవరి 28, ప్రభాతవార్త-వైద్యం** ఉమ్మడి నెల్లూరుజిల్లాలో పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు టీడీపీ జనసేనల కూటమివేనని తెలుగుదేశం పార్టీ మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధీమా వ్యక్తంచేశాడు. ఆదివారం నగరంలోని ఎస్వీజిఎస్ కాలేజీ ప్రాంగణంలో రా కదలి రా బహిరంగసభకు చంద్రబాబునాయుడు విచ్చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండను సైతం లెక్కచేయకుండా రెట్టించిన ఉత్సాహంతో కదలి రా కార్యక్రమానికి భారీసంఖ్యలో వచ్చిన జనసమూహాన్ని చూస్తే గెలుపు స్పష్టంగా కనిపిస్తుందన్నాడు. నెల్లూరు అంటే తెలుగురాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసిన పొట్టిశ్రీరాములు, సారావ్యతిరేక ఉద్యమం చేసిన దూబగుంట రోశమ్మతోపాటు ఎందరో రాజకీయ ఉద్ధండులు గుర్తుకొస్తారన్నారు. అటువంటి రాజకీయ చైతన్యంగల జిల్లాలో, ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో అక్రమార్కులు తయారు అయ్యారన్నాడు. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాటలు ఫుల్‌గా చెపుతాడని, అభివృద్ధి మాత్రం నిల్ అన్నాడు. నీటిపారుదల మంత్రి కాదని, నోటిపారుదల మంత్రని ఏద్దేవా చేశాడు. దొంతాలి, నాయుడుపేట, ఇస్కాన్ సిటీల్లో వందలకోట్ల భూములను అనిల్ కాజేశాడన్నాడు. అందుకే అనిల్‌ని గాల్లోపెట్టారని, ఎక్కడ నుంచి పోటీ చేస్తాడో కూడా తెలియడం లేదన్నాడు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఒక డెకాయిట్ అని అన్నాడు. భూకబ్జాలతోపాటు, గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నాడన్నాడు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెడపుట్టాడని, అక్కడ అన్ని అక్రమాలేనన్నాడు. ప్రసన్నకి సీటు ఇవ్వవద్దని ఆయన తమ్ముడే చెపుతున్నాడన్నారు. అయితే జగన్ అక్రమాలు, అన్యాయాలపై మొట్టమొదటిసారిగా గొంతు ఎత్తింది జిల్లా ఎమ్మెల్యేనని ఆభినందించాడు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి పనులకోసం గళమెత్తితే ఆయన ఫోను టాప్ చేశారని, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జగన్‌కి ఎదురుతిరిగి పోరాడాడని, అలాగే వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సైతం జగన్ ప్రభుత్వంలోని లోపాలను ధైర్యంగా ఎత్తిచూపాడన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఒక చేత్తో పదిరూపాయలు ఇచ్చి, మరోచేత్తో జగన్ వెయ్యి ప్రజల దగ్గరనుంచి లాక్కుంటుందని ఆరోపించాడు. కరెంటే కరంటు బిల్లులే గుండెదడను పెంచి, షాక్ కొడుతున్నాయన్నారు. జగన్ ఎన్నికలకు సిద్ధం అంటుంటే, ప్రజలు ఆయనకు జగన్‌కి వ్యతిరేకంగా యుద్ధానికి సిద్ధమంటున్నాడన్నారు. లక్షమందికి ఉద్యోగాలు ఇప్పించిన మాజీముఖ్యమంత్రి చంద్రబాబుని జైలుకు పంపించడం అతిపెద్దన్నాడు.

నాలుగున్నరేళ్ళలో జగన్‌చేసిన తప్పులకు ప్రజలు రానున్న ఎన్నికల్లో సరైన గుణపాఠం చెపుతారన్నాడు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ రాజుకి తప్పనిసరిగా ప్రజలకు అన్నంపెట్టే గుణం ఉండాలని, ఆ అన్నాన్నే పేదల నోటినుంచి తొలగించేసిన ఘనుడు జగన్ అని, ఆయన దగ్గర రాజుకి ఉండాల్సిన లక్షణాలు లేవని విమర్శించాడు. మన భవిష్యత్తుని తీర్చిదిద్దే వ్యక్తి చంద్రబాబు అని అన్నాడు. జగన్‌రెడ్డి పాలననుంచి విడిపించి రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దగల నాయకుడు ఒక్క చంద్రబాబు నాయుడేనన్నాడు.

**జగన్‌రెడ్డి పాలనంతా ధౌర్జన్యమే**

రాష్ట్రంలో రాజకీయాలు హుందాగా ఉండేవని, జగన్ అధికారంలోకి వచ్చాక అంతా ధౌర్జన్యమేనని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి అన్నాడు. ప్రజలను భయభ్రాంతులను చేస్తూ నాఎస్సీ, బీసీలు అన్ని వక్కాణించే జగన్ వారికి చేసింది ఏమిలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వెనుకబడిన వారికి అండగా నిలిచేందుకు తమ అధినాయకుడు పవన్‌కళ్యాణ్ సారథ్యంలో టీడీపీతో కలిసి జగన్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు అందరం కృషిచేస్తామని పేర్కొన్నాడు.

**బ్రిటీష్ పాలనను తలపిస్తున్న జగన్ పరిపాలన**

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో ఎక్కడచూసినా బ్రిటీష్‌పాలనను తలపిస్తోందని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ ధ్వజమెత్తాడు. రాష్ట్రంలో రాక్షసపాలనను జగన్ సాగిస్తున్నాడన్నాడు. ఎట్టిపరిస్థితుల్లో వైసీపీని ఇంటికి రానున్న ఎన్నికల్లో పంపించకపోతే రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి పోవడం తథ్యమన్నాడు. రాష్ట్ర అభివృద్ధి ప్రధాత చంద్రబాబునాయుడని అన్నాడు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని విమర్శించాడు. ప్రభుత్వ వేధింపులవల్ల రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు రావడంలేదన్నాడు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రజలపై రూ.13లక్షలకోట్లు అప్పుభారాన్ని నారాయణ మండిపడ్డాడు. పరిశ్రమలు రాకపోతే యువతభవిష్యత్తు అంధకారంలోకి వెళ్ళిపోతుందన్నాడు. ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలకు ఎవరికికూడా వైసీపీపాలన విధానం నచ్చడంలేదన్నారు. అందుకే అన్నివర్గాల ప్రజలు డిసైడ్ అయిపోయి వైసీపీని ఇంటిబాట పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించాడు. గత టీడీపీ హయాంలో ఎలాంటి అదనపుభారాన్ని మోపలేదని పొంగూరు వివరించాడు. రాష్ట్రంలో ప్రజా సుపరిపాలన అందించే ఏకైకవ్యక్తి చంద్రబాబన్నాడు. నెల్లూరుకోసం ఎన్నోపనులు చేపట్టామని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొచ్చి 50శాతం పనులు పూర్తిచేశామని, అయితే ఈ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆపనులను ఇప్పటివరకు పూర్తిచేయలేదని ఆయన గుర్తుచేశాడు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో టీడీపీని గెలిపించాలని కోరాడు.

**ఫిబ్రవరి 1 తరలిపోతున్న కృష్ణపట్నంపోర్టు**

కృష్ణపట్నంపోర్టు వచ్చేనెల ఫిబ్రవరి 1 తారీఖున కంటైనర్ కార్గో టెర్మినల్ తమిళనాడులోని అదానిపోర్టుకి తరలిపోనుందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉద్ఘాటించాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎంతోమందిని హత్యగావించిన ఘనుడు కాకాణి అని మండిపడ్డాడు. ఎన్టీఆర్ తెలుగుగంగని తీసుకొచ్చి 78 టీఎంసీలు, కండలేరు 146టీఎంసీలు ఉమ్మడి నెల్లూరుజిల్లాలో ఒక చరిత్ర సృష్టించిన ఘనత టీడీపీదేనన్నాడు. నేడు సోమశిల డ్యాం దెబ్బతినే ప్రమాదమన్నా నిపుణులు చెపుతున్నారని, ఈడ్యాం కింద 2లక్షల ప్రాణాలు ఉన్నాయన్నా పట్టించుకునే పరిస్థితుల్లో వ్యవసాయశాఖామంత్రి గోవర్ధన్‌రెడ్డి లేడన్నాడు. రూ.95కోట్లతో టెండర్ పిలిచి రూ.20కోట్లతో పన్నుచేసి ఆ కాంట్రాక్టర్ బిల్లులు ఇయ్యలేదని వెళ్ళిపోతే దానిని గాలికివదిలేశారని, ఏదైనా వరదవస్తే ఏమిచేయాలని నిలదీశాడు. వ్యవసాయశాఖామంత్రికి టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కూడా ఎర్రమట్టే తింటాడని, ఇసుక, తెల్లరాయి తినందే ఆయన నిద్రపోడన్నాడు. సోమశిల డ్యాం పరిశీలనకు రాలేని మంత్రి అరగంట మంత్రి అంబటి రాంబాబని ఏద్దేవాచేశాడు. ఆయన డ్యాన్సులకి సమయం ఉంటుందన్నాడు. ఇలాంటి మంత్రులు ఈ జిల్లాకు మంత్రులు ఉండడం మన ధౌర్భాగ్యమన్నారు. ఈ ఐదేళ్ళలో రెగ్యులర్, ఎన్‌ఈజిఎస్ రూ.1500కోట్ల నిధులను పనులు చేయకుండానే దోచుకున్న మంత్రి కాకాణి అని సోమిరెడ్డి మండిపడ్డాడు. సిలికా దందా రూ.5వేలకోట్లు, క్వాడ్జ్ ఆరేడునెలల్లో రూ.3వేలకోట్లు ఎలాంటి మైనింగు లీజు, అనుమతులు లేకుండా గోవర్ధన్‌రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించాడు. ఇంత జరుతున్నా మైనింగ్, పారెస్టు, కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లు, అధికారులు వైసీపీకి బానిసలుగా మారిపోయారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించాడు. ఎస్సీలు వైసీపీ నేతల కాళ్ళవద్ద బానిసలుగా మారి వారికి ఊడిగం చేస్తున్నారని సోమిరెడ్డి దుయ్యబట్టాడు. ఏనాడు కూడా కాకాణి గోవర్ధన్‌రెడ్డిలాగా ప్రజల ఆస్తులను దోచుకోవడం లాంటివి నా జీవితంలో చేయలేదన్నాడు.



# చిల్లర రాజకీయాలు మానుకోవాలి



**ముత్తుకూరు, జనవరి28, ప్రభాతవార్త** సొంత ప్రయోజనం కోసం సర్వేపల్లి నియోజకవర్గంలో చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి చూసి ఓర్వలేక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అబద్దాలు చెప్పి అధికారం కోసం పాకులాడుతున్నారన్నారు. 5సార్లు ఓడిపోయిన వ్యక్తి మళ్లీ సర్వేపల్లి నియోజకవర్గంలో పోటీ చేస్తే నియోజకవర్గంలో 10వేల ఓట్లు కూడా వచ్చే అవకాశం కూడా లేదన్నారు. ఆదాని కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టర్మినల్ మూసివేస్తున్నారన్న దుష్పచారం చేశారన్నారు. అలా దుష్పచారం చేస్తే వారి నుండి కూడా ముడుపుతు తీసుకునే సిద్ధహస్తులన్నారు. అసలు సర్వేపల్లి నియోజకవర్గం టికెట్టు ఈయనకు ఇస్తారో లేదో తెలియని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. నియోజకవర్గంలో సోమిరెడ్డి వెలగబెట్టింది ఏమిలేదని, మా హయాంలో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నిర్వహించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సీఎం పాలనకు సుభిక్షుతులై ఇతర రాష్ట్రాలు కూడా ఆయనను ఆదర్శంగా తీసుకుని పరిపాలన సాగిస్తున్నాయంటే ఆయన నిబద్ధతకు ప్రత్యేక నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ విజయకేతనం ఎగరవేస్తుందని, ఎంతమంది చంద్రబాబులు, పవన్‌కళ్యాణ్‌లు ఏకమైనా వైసీపీని ఏమిచేయలేరని, రాష్ట్ర ప్రజల దీవెనలు జగన్మోహన్‌రెడ్డి ఎల్లవేలలా ఉన్నాయన్నారు. కృష్ణపట్నం స్మశానవాటికను అభివృద్ధికి కర్నాలు వీధికి చెందిన స్మశానాన్ని అభివృద్ధి పరిచి ప్రారంభించినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ వజ్రావతమ్మ, మాజీ జడ్పీటీసీ నెల్లూరు శివప్రసాద్, పటపాలెం సర్పంచ్ ఆలపాక శీనయ్య, స్థానికనాయకులు కారంశెట్టి శివరాంప్రసాద్‌శర్మ, రాగాల కోదండయ్య, చింతాల రమణయ్య, కట్టా సుబ్బయ్య, కన్వీనర్ కందస్వామి, రాగాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల జట్టు విజేత... పొట్టేపాలెం



**కోవూరు, జనవరి 28ప్రభాతవార్త** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని మిత్ర సీడ్స్ సమీపంలో ఆదివారం లేగుంటపాడు రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పోటీల్లో పొట్టేపాలెంకు చెందిన వరసిద్ధి వినాయక స్వామి ఎడ్ల జట్టు ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఈ జాకీలకు గునుపాటి మిత్ర రెడ్డి 25 వేల రూపాయలు ప్రథమ బహుమతి కింద కప్పుతో పాటు అందజేశారు. ఈ పోటీలు తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

– **విజేతలు వీరే..** రెండవ బహుమతిని గాదెలదిన్నెకు చెందిన ఎం. దనార్జన్ ఎడ్ల జట్టు కైవసం చేసుకుంది. ఈ జట్టుకు 20 వేల రూపాయలు నగదు బహుమతి, కప్పును ఎడ్ల బండి సంఘం అందజేశారు. మూడవ బహుమతిని యల్లాయపాలెంకు చెందిన శ్రీ గంగమ్మ తల్లి ఎడ్ల జట్టు కైవసం చేసుకోగా.. వీరికి 15 వేల రూపాయలు నగదు బహుమతి, కప్పును బట్టేపాటి వేణు జ్ఞాపకార్థం వారి స్నేహితులు అందజేశారు. నాల్గవ బహుమతిని గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరి దేవి ఎడ్ల జట్టు కైవసం చేసుకోగా.. వీరికి బహుమతి కింద 10 వేల రూపాయల నగదు, కప్పును దువ్వూరు వెంకటేశ్వర్లు అందజేశారు. అదే విధంగా ఐదవ బహుమతిని రంగనాయకుల పేటకు చెందిన శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఎడ్ల జట్టు కైవసం చేసుకోగా.. వీరికి 5 వేల రూపాయల నగదు , కప్పును షేక్. గౌస్ అందజేశారు. ఈ సందర్భంగా మహిళా బ్యాంక్ సీఈవో గునుపాటి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమ సోదరుడు గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా ఈ రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలను నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ఈ పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మిత్ర సీడ్స్ అధినేత గునుపాటి మిత్రా రెడ్డి , గునుపాటి మనోజ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఉన్నారు.

## తూనికలు, కొలతలు తేడాలు వస్తే కఠిన చర్యలు



బిట్రగుంట, జనవరి 28 ప్రభాతవార్త బోగోలు మండలంలోని రేషన్ షాపు దుకాణాలలో నిత్యావసర వస్తువుల పంపిణీలో తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి తూనికలు, కొలతలు శాఖ ఇన్స్పెక్టర్ కరీముల్లా హెచ్చరించారు. బోగోలులో ఆదివారం రేషన్‌షాపులకు సంబంధించి కాటాల తనిఖీలు నిర్వహించారు. డీలర్లు ప్రతి ఏడాది ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ లైసెన్సు ఫీజులు చెల్లించి కాటాలకు తప్పనిసరిగా సీల్ వేయించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే తనిఖీలలో డీలర్లకు ఫెనాల్టీ చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు జనపాల సురేష్‌రెడ్డి తదితరులు వున్నారు.

## కావలి డివిజన్ రెవెన్యూ రిటైరీ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

కావలి రూరల్, జనవరి 28 ప్రభాతవార్త కావలి డివిజన్ రెవెన్యూ రిటైరీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ అసోసియేషన్ అధ్యక్షులుగా విశ్రాంత ఉపతహశీల్దార్ యం.సిరాజ్ అహ్మద్ బేగ్, ప్రధాన కార్యదర్శిగా విశ్రాంత ఉపతహశీల్దార్ యం.సుబ్రమణ్యం, కోశాధికారిగా విశ్రాంత తహశీల్దార్ సూరిశెట్టి నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

## స్మాష్ రాకెట్ రాష్ట్ర జట్టు ఎంపికలు



కోవూరు, జనవరి 28ప్రభాతవార్త : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం రాష్ట్ర స్మాష్ రాకెట్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక కార్యక్రమాన్ని అసో సియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాభిమానులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. ఎంపికైన జట్లు మార్చి నెలలో జరిగే జాతీయ స్థాయి స్మాష్ రాకెట్ పోటీలో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవిక, సిరాజ్ అహ్మదీలు తెలిపారు.

## ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగకరం



కోవూరు, జనవరి 28ప్రభాతవార్త : కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న వశిష్ట ఆంగ్ల మాధ్యమ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమంలో బాలబాలికలకు వైసీపీ యువనాయకుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి బాలబాలికలు కరాటేపై దృష్టి పెట్టడం వలన ఆత్మరక్షణకు ఈ విద్య ఎంతగానో ఉప యోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఈ కరాటే నేర్చుకుని మంచి ప్రావీణ్యం సంపాదించాలన్నారు. నిర్వాహకులు అనూప్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానం చేశారు.

## చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పొనకా కుటుంబం



నెల్లూరు జనవరి 28, ప్రభాతవార్త-వైద్యం రూరల్ నియోజకవర్గ గొల్లకందుకూరు గ్రామానికి మేజర్ పం చాయతీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీగా పనిచేసిన పొనకా శివకుమార్‌రెడ్డి, హరికుమార్‌రెడ్డిలు రా కదలి రా బహిరంగసభకు విచ్చేసిన నారా చంద్రబాబునాయుడు సమక్షంలో, రూరల్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ పార్టీ కండువాలను చంద్రబాబు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించాడు.

## నేటి నుండి మేకపాటి విజయీభవ యాత్ర


ఆత్మకూరు, జనవరి28, ప్రభాతవార్త : ఆత్మకూరు రూరల్ మండలానికి సంబంధించి సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉదయం 10-30గంటలకు జరిగే ఆసరా కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారని, మధ్యాహ్నం 12గంటలకు మేకపాటి ధాత ృత్వంతో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో ఎపిపిఎస్‌సి గ్రూప్-2 పరిక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేస్తారని, మధ్యాహ్నం 3గంటలకు మర్రిపాడు మండల కేంద్రంలో జరిగే వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారని, సాయంత్రం 5గంటలకు మర్రిపాడు మండలం కంపసముద్రం పంచాయతీ పరిధిలో జరిగే విజయీభవ యాత్రలోపాల్గొంటారని అనంతరం వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని, 30వ తేదీ ఉదయం 10-30గంటలకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే ఆత్మకూరు మున్సిపాల్టీకి సంబంధించిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారని ఆత ్మకూరు మేకపాటి కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

## రాజీనామా కు సిద్ధం ,,ఎంపిటిసి సభ్యురాలు లక్ష్మిదేవి



వరికుంటపాడు, జనవరి28, ప్రభాతవార్త : వైకాపా ప్రభుత్వం ఏర్పాటు కోసం గ్రామాల్లో తమ శాయశక్తులు కృషి చేసి, లక్షల రూపాయలను తమ సొంత డబ్బులను వెచ్చించి మరి అధికార పార్టీలో ఎంపిటిసి సభ్యురాలు గా గెలిచినప్పటికి పార్టీలో తమకు కనీస గౌరవం దక్కడంలేదని, ఈ పదవులు మాకెందుకు అంటూ మండలంలోని విరువూరు ఎంపిటిసీ సభ్యురాలు కాళె లక్ష్మిదేవి, రమేష్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ధర్మవరంలోని ఆమె నివాసంలో భర్త రమేష్‌తో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి తమ గోడును వెళ్ళడించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకోసం భూ పంపిణీ కి శ్రీకారం చుట్టగా పేద ప్రజలకు అండగా ఉండాలనే తాము తమ గ్రామంలో భూమి లేని వారి లిస్ట్ లను తయారు చేసి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన సూచన మేరకు అర్హుల జాబితాను మండలంలో కీలక నేతకు అందజేసామనీ కానీ ఆనేత తమను లక్షల రూపాయలు ఇస్తేనే ఆ లిస్ట్ అమోదం పొందుతుందని చెప్పారనీ, తాము నగదు ఇవ్వకపోవడంతో మేము ఇచ్చిన లిస్ట్‌ను పక్కన పడేయడమే కాకుండా తాము అనుభవంలో ఉన్న భూమిని సైతం వేరే వారికి పేట్టేందుకు ప్రయత్నిస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ లో లక్షలాది రూపాయల నిధులు ఉన్నప్పటికి ఎ ఒక్కరికి రూపాయి కూడా ఇవ్వకుండా ప్రధాన నేతలు తమ ఇష్టానుసారంగా ఆ నిధులను దుర్వినియోగం చేస్తూ వారే లక్షల రూపాయలను దోచుకుంటున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయాన స్వంత పార్టీ నేతలే తమకు విలువ ఇవ్వకుండా తమకు ఏమాత్రం సహకరించచడంలేదని అలాంటప్పుడు తమకు ఈ పదవులు ఎందుకనీ, రాజీనామా చేసేందుకు సన్నిహితులతో చర్చిస్తున్నారు. ఏది ఏమైన అధికార పార్టీలో నెలకొన్న ఈ సందిగ్ధత రానున్న ఎన్నికల్లో తీవ్ర ప్రభావాన్ని చాటనున్నాయి.

## పుష్పయాగం ఆహ్వాన పత్రిక విడుదల చేసిన ఎమ్మెల్యే



బుచ్చి జనవరి 28 ప్రభాతవార్త పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ఫిబ్రవరి 2 వ తేదీ ప్రదోషకానం నందు దాత సహకారంతో పుష్పయాగం అత్యంత వైభవంగా జరుగునున్నట్లు జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుటా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. పుష్పయాగం ఆహ్వాన పత్రికను కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, రూరల్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, మోర్ల మురళీ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈకార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు, పాలక మండలి సభ్యులు గుమ్మా రఘురామయ్య, బట్టేపాటి విజయమ్మ, గుంటూరు కామేశ్వరీ, కాగాళ్ళ పద్మ, ఆలయ అర్చకులు వేదపండితులు పాల్గొన్నారు.

## దేవరవేమూరులో ఇంటింటికి జనసేన



సైదాపురం, జనవరి 28, ప్రభాతవార్త మండల పరిధిలోని దేవరవేమూరు గ్రామంలో జనసేన పార్టీ వెంక టగిరి నియోజకవర్గ సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమం ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు గడపగడపకు వెళ్లి జనసేన సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. అలాగే తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీపై ప్రచారం నిర్వహించి కరపత్రాలను ప్రజలకు అందించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనలను ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కూరాకు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మందా సతీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలి




సైదాపురం, జనవరి 28, ప్రభాతవార్త అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో పదవ రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా గురిజాలలో ఫిబ్రవరి 3, 4వ తేదీల్లో జరగబోయే మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య తెలిపారు. సైదాపురంలో మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత రైతు కూలి సంఘం పోరాటాల నుండి ఉద్భవించిందని, ఈ పోరాటాల్లో ఎంతో మంది అమరులు ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జారీ చేసిన భూ సర్వే పేరుతో పేదల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను భూ స్వాములకు అప్పగించే ప్రయత్నంలో భాగంగా అసైన్డ్‌మెంట్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంకయ్య, సుధాకర్, వెంకటయ్య, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెరపాలెంలో వెలగని వీధిదీపాలు

ఉలవపాడు, జనవరి28, ప్రభాతవార్త ఉలవపాడులోని వడ్డెరపాలెం అంధకారంగా మారాయి. సాయంత్రం ఒక్క వీధిలైటు కూడా వెలగకుండా వీధులన్నీ చీకటిమయం అయ్యాయి. పంచాయతీ అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ముఖ్యంగా ఆ ప్రాంతాల్లో మహిళలు వీధులగుండా వెళ్లాలంటే రాత్రివేళల విషసర్పాలు తిరగడం వలన వీధుల్లో వెళ్లాలంటే భయభ్రాంతులకు గురిఅవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలను మరమ్మత్తులు చేయించి అంధకారాన్ని తొలగించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలు




కావలి, జనవరి 28 ప్రభాతవార్త విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకే కావలి ఇండియన్ మెడి కల్ అసోసియేషన్(ఐయంఎ) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సైన్స్ క్విజ్ పోటీలను నిర్వహిస్తుందని ఐయంఎ గౌరవ సలహాదా రుడు, సైన్స్ క్విజ్ జీవప్రదాత డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. కావలి పట్టణ పాతవూరులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం సైన్స్ క్విజ్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ బెజవాడ మాట్లాడారు. ఐయంఎ ఆధ్వర్యంలో సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించడం 18వ సారి అ న్నారు. ఈ రోజు జరిగిన క్విజ్ పోటీలలో 26 పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారన్నారు. సైన్స్ క్విజ్ పోటీలపై అవగాహనతో కూడిన పూర్వాపరాలను, తీరుతెన్నుల్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన బి.శ్రీదేవిని ఘనంగా సత్కరించి మమోంటోను అందజేశారు. మ్యాథ్స్ టీచర్ మహేష్ తన ప్రాస కవితలతో విద్యార్థులను, విద్యార్థుల తల్లి దండ్రులను అలరించి ఆకట్టుకున్నారు. సైన్స్ క్విజ్ ఆర్గనైజర్‌గా డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ శ్రీరాంమనో హర్ బాబులు వ్యవహరించారు. కావలి ఐయంఎ అధ్యక్షులు, ఏరియా వైద్యశాల మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కామంచి సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ వి.గోపీకృష్ణ, ట్రజరర్ డాక్టర్ పి.శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఈ సైన్స్ క్విజ్ పోటీలు ఎంతో ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ టి.వి. లుకోధర్, డైరెక్టర్స్ శ్రీకర్ల వెంకయ్య, ఎన్.మధుసూదనరావు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వ ర్లు, కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్, జెవివి జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల ముంగిళ్ళలోకి



కావలి, జనవరి 28 ప్రభాతవార్త భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల ముంగిళ్లలోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు బిజెపి కావలి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం తెలిపారు. కావలి పట్టణం పాతవూరు కృష్ణుడి గుడి సెంటర్‌లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల జీవితాలలో మార్పు తెచ్చే పథకాల లబ్ధిని ప్రతి ఒక్కరికి చేర్చడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. అయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, చర్యలను వివరించేందుకే సంకల్ప యాత్ర ఒక వేదిక అని తెలిపారు. గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధిచేకూరడం లేదని ప్రభుత్వం దృష్టికి రావడంతో ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ శ్రీకారం చుట్టరన్నారు. అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్న సంకల్పంతో భారత ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారం చేపట్టాక కావలి మున్సిపాల్టీకి దాదాపు వంద కోట్ల రూపాయలు అమృత పథకం ద్వారా అందజేయడం జరిగిందన్నారు. గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా కరోనా సమయం నుండి నేటి వరకు ప్రతి ఒక్కరికి ఐదు కేజీల వంతున ఉచితంగా బియ్యంను అందజేయడం జరిగిందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి ఆరు వేల రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. చిరు వ్యాపారులకు పియం స్వనిధి పథకం ద్వారా ప్రతి ఒక్కరికి పది వేల రూపాయలు బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలయ్యే ప్రతి పథకానికి మోడీ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత, ప్రముఖ రియల్టర్ జనిగర్ల మహేంద్ర యాదవ్, బిజెపి నేతలు వింతా రంగారెడ్డి, పరుసు వెంకటేశ్వర్లు, పాతపాటి రమణారెడ్డి, మందా కిరణ్‌కుమార్, కూరాకుల సవీంద్ర, పసుపులేటి సుధాకర్, యం.శ్రీనివాసులు, షేక్ మస్తాన్, ముంగమూరు వెంకటరెడ్డి, మర్రిబోయిన అనిత, గుడిపల్లి ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ డిఇ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

## ప్రధమ బహుమతి సాధించిన అన్నారెడ్డిపాళెం జట్టు



సంగం జనవరి28 ప్రభాతవార్త ఆత్మకూరు నియోజకవర్గం స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీలలో ఫైనల్‌లో మహిళా కబడీ మ్యాచ్‌లో ఆత్మకూరు వర్సెస్ సంగం మండలం అన్నారెడ్డిపాళెం మధ్య హోరాహోరిగా జరిగింది. ఈ మ్యాచ్‌లో అన్నారెడ్డిపాళెం క్రీడాకారులు మొదటి బహుమతి 35 వేల రూపాయాలు సాధించారు. ఈ మహిళల కబడ్డీ జట్టులో పాల్గొన్న పి.అనూహ్య (కెప్టెన్), జి .ప్రహర్షిని, ఎన్.అమల, ఎన్.స్రవంతి, ఎం.శిల్ప. ఇ పావనీ, బి.స్నేహ డి.నాగవల్లి, జి.ఝాన్సీ, బి స్రవంతి, బి.మంజుల ,బి. షారోన్, బి.లాసన్య, ఎం.చెంచులక్ష్మీ, జి.కావేరి, లు ప్రతిభను కనబరిచి విజయం సాధించారు. అలాగే ఈనెల 31 నుండి ఫిబ్రవరి 3 వరకు జరగబోయే జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రకి వీరిని జిల్లా లెవెల్‌కు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపిక చేసినట్లు కోచ్ తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్చిన గ్రామస్తుల అభినందించారు.

## చంద్రబాబు సభకు భారీ ఎత్తున తరలిన బుచ్చి నేతలు



బుచ్చి జనవరి 28 ప్రభాతవార్త రా.... కదలి రా అని పిలుపు మేరకు చంద్రబాబునాయుడు నెల్లూరు సభకు బుచ్చిరెడ్డిపాళెం నుండి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం నుండి పెద్దఎత్తున మోటార్‌బైకులు, ఆటోలు, కార్లులలో నాయకులు తరలి వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షులు ఎంవి శేషయ్య, బత్తల హరికృష్ణా, వింజం రామానాయుడు, దొడ్ల కోదండరామిరెడ్డి, తాళ్ల నరసింహస్వామి, బండ్ల కొండయ్య, జూగుంట పురుషోత్తమ్, నెల్లూరు దయాకర్‌రెడ్డి, నెల్లూరు ద్వారకనాద్‌రెడ్డి, వింజం మహేష్‌నాయుడు, యిమ్మడిశెట్టి సుబ్బారావు, దశరద్‌కుమార్, వల్లూరు శ్రీనివాసులు, రాజేష్, శంకర్, కె.కిషోర్, మైనార్టీనాయకులు బచ్చాభాయి, అహ్మద్‌భాషా, ఖాదర్‌బాషా, సర్దార్, షబ్బీర్, అక్తర్, కాలేషా, ఎం.డి మొహుద్దీన్, మినగల్లు సురేష్‌రెడ్డి, చల్లాయపాళెం వెంకటేశ్వర్లు, భరత్‌కుమార్, పురంధరపురం కృష్ణారెడ్డి, చవడారెడ్డి, ఉసురుపాటి ప్రసాద్, ఇస్కపాళెం తిరిపాలు, వవ్వేరునాయకులు శివయ్య, కాగులు పాడునాయకులు, శంకర్, శివ, పలువురు టిడిపినాయకులు, జనసేననాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు.

## విద్యార్థుల తల్లిదండ్రుల డేటా మీకెందుకు నారాయణ



నెల్లూరు రూరల్, జనవరి 28, ప్రభాతవార్త విద్యార్థుల తల్లిదండ్రుల డేటా మీకెందుకు నారాయణ అని జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. నెల్లూరు నగర టీడీపీఅభ్యర్థిగా పొంగూరు నారాయణ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని ఆయన ఎద్దేవ చేశారు. నీ స్వార్థ రాజకీయాల కోసం సంస్థల్లోని ఉపాధ్యాయులను రోడ్డు మీద పడేశావు, ఇప్పుడు విద్యార్థుల తల్లిదండ్రుల డేటా చోరీ చేస్తున్నాడని తెలిపారు. నారాయణ విద్యార్థుల తల్లిదండ్రుల డేటా ఎందుకు స్వీకరిస్తు న్నారో చెప్పాలని ఆయన అన్నారు. నారాయణ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులు డేటా చోరీపై పొంగూరు నారాయణని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఈ విధానాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖం డిస్తుందని తెలిపారు. వెంటనే పిల్లల తల్లిదండ్రుల వివరాలు సేకరణ నారాయణ ఎందుకు చేస్తున్నట్లు వివ రించాలని డిమాండ్ చేశారు.

## రా కదిలిరా కార్యక్రమానికి తరలిన టిడిపి నేతలు

వింజమూరు, జనవరి28, ప్రభాతవార్త :నెల్లూరులో ఆదివారం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ' రా కదిలిరా ' కార్యక్రమానికి వింజమూరు నుండి తెలుగుదేశం నేతలు అధిక సంఖ్యలో పలు వాహనాల్లో తరలి వెళ్ళారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావ్ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు పంచాయతీల నుండి వాహనాల్లో తరలి వెళ్ళారు. ఈకార్యక్రమంలో జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ గురజాల వాసునాయుడు, మైనార్టీ అధ్యక్షులు షేక్ మహబూబ్‌బాషా, యూనిట్ ఇన్‌చార్జ్ కొండపల్లి వెంకటేశ్వర్లు, , మహిళా నాయకురాలు నూతలపాటి జయలక్ష్మి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరికొండ శ్రీనివాసులు, గంగపట్ల వెంగయ్య, బిసి సెల్ నాయకులు తిరుపతాచారి, ఇతర నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వయోపరిమితి 62 సంవత్సరాలు చేయండి



నెల్లూరు రూరల్, జనవరి 28, ప్రభాతవార్త 1998 మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉ పాధ్యాయుల వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని పలు వురు ఉపాధ్యాయులు ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసా య, ఫుడ్ అండ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే తమ వేతనాలను కూడా పెంచి పెన్షన్ వసతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమకు పాతికేళ్ల అనంతరం పెద్ద మనసుతో మనవతా దృక్పదంతో తమ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన మేలు ఎప్పటికి తమ జీవితాల్లో మరువరానిదని మంత్రి కాకాణి వివరించారు. గత ఏడాది ఏప్రిల్ నెల 14వ తేదీన తాము ఉద్యోగాల్లో నియామకం అయ్యామని అయితే నియామక ఉత్తర్వులు ఉద్యోగ విమరణ వయస్సు 60 ఏళ్లుగా ప్రభుత్వం నిర్ధారించి ఉందని వారు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లుగా ఉన్నందున తమకు కూడా వెసులుబాటు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. 60 ఏళ్ళ విరమణ వయస్సు ఉన్నందున ఇప్పటికే చాలా మంది ఉద్యోగ విరమణ స్వల్ప కాలంలోనే పొందారని త్వరలోనే మరికొంత మంది విరమణ వయసుకు దగ్గరలో ఉన్నారని, ఈ దృష్ట్యా తమకు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, కార్యదర్శి రిజ్వ, సలహాదారులు ఎస్‌కేఎం గౌస్, మొహిద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ రాయసం రాంబాబు, సీహెచ్ కృష్ణారెడ్డి, సయ్యద్ నయిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అపరిశుభ్రంగా మారిన ఉదయగిరి ఆనకట్ట



ఉదయగిరి, జనవరి28, ప్రభాతవార్త మండలకేంద్రమైన ఉదయగిరిలోని ఆనకట్టు మీద చికెన్ కోసం తీసుకుని వచ్చే కోళ్ల వ్యర్థాలను బాధ్యతా రహితంగా ఎక్కడపడితే అక్కడ వదిలేస్తున్నారని అందు వల్ల దుర్వాసన వెదజల్లి ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురిఅవుతున్నారని స్థానికులు ఆరోపించారు. ఉదయగిరి ట్యాంక్ బండ్ ఆనకట్టమీద సేదతీరడానికి ఎంతో మంది ప్రజలుప్రతిరోజూ వస్తూ అక్కడ కూర్చుని ఉంటారని, కోళ్ల వ్యర్థాలను నడిరోడ్డుమీద ఒదిలేయడం వలన వచ్చే దుర్వాసన వలన అక్కడికి ఎవ్వరూ రావడంలేదని తెలి పారు. ఉ దయగిరిలో మురుగు కాలువలతో ఇబ్బంది పడే ప్రజలు ఇప్పుడు కోళ్ల వ్యర్థాలతో ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఉదయగిరి పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా తమకు ఏమి తెలి యదన్నట్లు వ్యాపారస్తులతో లాలూచీఅవ్వడం వలనే ఈ విధమైన కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులతో కుమ్మక్కైన వ్యాపారస్తులు చికెన్ ధరలు అమాంతం పెంచేసి చుట్టుపక్కల ఊర్లలో అమ్మే ధరలకంటే రెండింతలు ఎక్కువధరకువిక్రయిస్తున్నారని వారు ఆపోరించారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా ఉందని ఇప్పటికైనా పైస్థాయి అధికారులు సరైన చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా కోళ్ల వ్యర్థాలకు ఊరికి దూరంగా డంప్‌యార్డ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## చంద్రబాబునాయుడు సభకు తరలివెళ్లిన ఉదయగిరి టిడిపి నాయకులు



ఉదయగిరి, జనవరి28, ప్రభాతవార్త నియో జకవర్గ కేంద్రమైన ఉదయగిరి నుండి మాజీ ముఖ్యమంత్రి నాయకులు చంద్రబాబు నాయుడు నెల్లూరులో నిర్వహించిన సభకు ఉదయగిరి నుండి టిడిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వారు మా ట్లాడుతూ చంద్రబాబునాయుడు నిర్వహిం చిన సభకు జిల్లా నలుమూలల నుండి జనం తండోపతండాలుగా రావడంజరిగిందని తెలిపారు. చంద్రబాబునాయుడును హెలీప్యాడ్ వద్ద తెలుగుదేశం పార్టీ కార్య నిర్వహక కార్యదర్శి పి.చెంచల్‌బా బు యాదవ్, ఉదయగిరి టిడిపి మండల కన్వీనర్‌చింతనబోయిన బయన్న యాదవ్ కల వడం జరిగిందని వారు తెలిపారు. రాబోయే రోజుల్లో చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రిగా గెలవడం ఖాయమని తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో గొప్ప ఆధరణ ఉందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

## గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జనవరి 28, ప్రభాతవవార్త మండలంలోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రాంరెడ్డిఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా కోర్ కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి, పొనక కనకమ్మ విగ్రహాలకు ఖాది వస్త్రము, నూలుమాల సమర్పించారు. అనంతరం నెల్లూరు రవీంద్రాంరెడ్డి గాంధీ యొక్క ఆశయాలను స్కూల్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు పాపిరెడ్డి, స్కూల్ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి లాంటి డాక్టర్ ప్రభాకర్‌నాయుడు సేవలు మరువలేనివి




**కావలి రూరల్, జనవరి 28 ప్రభాతవార్త** తండ్రి లాంటి ప్రముఖ వైద్యులు, కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు సేవలు మరువలేనివని, ఆయన ఎంతోమందికి ఆదర్శమని పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ సతీమణి పసుపులేటి సుగుణమ్మ తెలిపారు. పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్, చెన్నై గ్లెనీగల్స్ హెల్త్ సిటీ సంయుక్తంగా కావలి పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ వైద్యశాలలో డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు పర్యవేక్షణలో ఆదివారం ఉచిత మెగా లివర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో చెన్నై గ్లెనీగల్స్ హెల్త్ సిటీ సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వైద్య నిపుణులు డాక్టర్ రజనీకాంత్ పచ్చా పాల్గొని తగిన సలహాలు, సూచనలు తెలిశారు. ఫ్యాటీ లివర్ వున్న 135 మందికి 15 వేల రూపాయలు విలువ కల్గిన ఫైబ్రోస్కాన్ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి పసుపులేటి సుగుణమ్మ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు మాకు తండ్రి సమానులని తెలిపారు. ఆయన సలహాలు, సూచనలతో కావలి, పరిసర ప్రాంత ప్రజలకు మరెన్నో ఉచిత మెగా శిబిరాలు ఏర్పాటు చేస్తూ ఎంతోమందికి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రముఖ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వైద్య నిపుణులు డాక్టర్ రజనీకాంత్ పచ్చా మాట్లాడుతూ చెన్నై గ్లెనీగల్స్ హెల్త్ సిటీ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్‌నాయుడు సూచనలతో కావలి పట్టణానికి చెందిన 4 సంవత్సరాల బాలుడు మోక్షానంద్‌కు, గౌస్‌బాషాలకు లివర్ ప్లాంటేషన్ శస్త్ర చికిత్స పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయంతో చేయడం జరిగిందన్నారు. వీరు ఇద్దరు ప్రస్తుతం ఆరోగ్యవంతంగా జీవిస్తున్నారని వారిని చూపించారు. ముఖ్యంగా ఆల్కాహాల్ సేవించడం వల్ల, వైరస్ వల్ల ఎక్కువుగా లివర్ దెబ్బతినే ప్రమాదం వుందన్నారు. మా హాస్పిటల్‌లో సంవత్సరానికి 150 లివర్ ప్లాంటేషన్లు ద్విగ్విజయంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కావలి, పరిసర ప్రాంత ప్రజలకు లివర్ స్క్రీనింగ్ ఉచిత క్యాంప్‌ను ఏర్పాటు చేసిన పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్‌కు, చెన్నై గ్లెనీగల్స్ హెల్త్ సిటీ వారికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నై గ్లెనీ గల్స్ హెల్త్ సిటీ వైస్ చైర్మన్ వాకా భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఎన్.శివకుమార్, డాక్టర్ హోలిమౌలాలి, డాక్టర్ వినయ్ వినోద్‌బాబు, డాక్టర్ అక్బర్‌బాషా, మాజీ ఎంపిపి దామిశెట్టి పూర్ణచంద్రరావు, జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, కాపు నేత బీమా రంగారావు, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, లోక్‌సత్తా నాయకులు యం.మాల కొండారెడ్డి,మొగల్ సలీంబేగ్, పసుపులేటి టీం సభ్యులు, పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## వైసీపీ వైపు యువత- ఎంపీ ఆదాల



**నెల్లూరు రూరల్, జనవరి 28, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ 12వ డివిజన్ ధనలక్ష్మీపురంలోగుంటక వంశీ కృష్ణ ఆధ్వర్యంలో భారీగా యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షులు రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 300 మంది పైగా టీడీపీ, జనసేన పార్టీ నుండి వైసీపీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఆదాల చేతుల మీదుగా వైసీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 14 ఏళ్ల రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసిందేమి లేదని, మోసపూరిత మాయమాటలు చెబుతూ ప్రజల్ని మోసం చేస్తున్నాడని ఆయన అన్నారు. సీఎం జగనన్న సంక్షేమం అభివృద్ధితో పాటు ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ఆకర్షితులై ఎంతో మంది యువత వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని, పార్టీలో చేరే యువతకు ఎప్పుడు అండగా నిలుస్తామని ఎవరు ఎలాంటి బెదిరింపులు బెదిరించిన భయపడాల్సిన అవసరమే లేదని, చేరిన యువతకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. క్రమంలో నగర మేయర్ పోట్లూరి స్రవంతి జయవర్ధన్, డీసీసీబీ మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వర్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పోటీలు



**కోవూరు,జనవరి 28ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని మిత్ర సీడ్స్ గోదాము ప్రాంతంలో ఆదివారం గనుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పోటీలను నాబార్డు డీడీఎం రవిసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీల వలన కనుమరుగైపోతున్న ఎద్దుల జాతిలను విరివిగా చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి ఔత్సాహికులు రావడం అభినందనీయన్నారు. గత రెండు సంవత్సరాలుగా రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో తులసీరామ్ రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి 37 ఎడ్ల జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన ఎడ్ల జాకీలను శాలువాతో సత్కరించి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా బ్యాంక్ సీఈవో గునుపాటి ప్రసాద్‌రెడ్డి, మిత్ర సీడ్స్ అధినేత గునుపాటి మిత్రా రెడ్డి , గునుపాటి మనోజ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



**లేగుంటపాడు(కోవూరు,)జనవరి 28ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని మిత్ర సీడ్స్ ప్రాంతంలో ఆదివారం గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పందెం పోటీలను లేగుంటపాడు రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ పోటీలు తిలకించేందుకు తండోపతండాలుగా క్రీడాభిమానులు వచ్చారు. దీంతో ఈ ప్రాంగణ మంతా క్రీడాభిమానంతో పూర్తిగా నిండిపోయింది. పోటీలో పాల్గొన్న ఎడ్ల జాకీలు బహుమతి కైవసం చేసుకునేందుకు తమ ఎడ్లను ఉరకలెత్తించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైతు సమన్వయ కమిటీ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది.

## చంద్రబాబుకు స్వాగతం పలికిన అబ్దుల్‌అజీజ్



**నెల్లూరు జనవరి 28, ప్రభాతవార్త-వైద్యం** నగరంలో జరిగిన టీడీపీ నేతలు చేపట్టిన రా కదలి రా బహిరంగసభకు విచ్చేసిన టీడీపీ జాతీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కనపర్తిపాడు లోని హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికిన వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్‌లు శాలువాలు కప్పి, పూలబొక్కేని అందచేసి ఘన స్వాగతం పలికారు.

## జాతీయ స్థాయి స్మాష్ రాకెట్ పోటీలు మార్చి 1న



**కోవూరు,జనవరి 28ప్రభాతవార్త :** మూడవ జాతీయ స్థాయి స్మాష్ రాకెట్ పురుషుల, మహిళల పోటీలు మార్చి నెల 1,2,3 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని ఎస్‌డీఎం పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర స్మాష్ రాకెట్ అసోసియేషన్ అధ్యక్ష , ప్రదాన కార్యదర్శులు దేవిక, సిరాజ్ అహ్మద్‌లు తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఈ పోటీలకు సంబంధించి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్మాష్ రాకెట్ ఆటను రాజస్థాన్ అసోసియేషన్ 2022లో ప్రారంభించడం జరిగిందన్నారు. రెండు పర్యాయాలు రాజస్థాన్‌లోనే ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మూడవ జాతీయ స్థాయి స్మాష్ రాకెట్ పోటీలకు హర్యానా రాష్ట్రం వేదిక కానున్నదన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఈ స్మాష్ రాకెట్ పోటీలను స్కూల్ గేమ్స్‌లో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ స్మాష్ రాకెట్ పోటీలకు ఖర్చు కూడా చాలా తక్కువని, శరీరానికి మంచి వ్యాయామం కూడా ఇస్తుందన్నారు. వయోబేధం లేకుండా ఎవరైనా ఈ ఆటలో ఉత్సాహంగా పాల్గొనవచ్చని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

## తూపిరి పెంచలయ్య సేవలు చిరస్మరణీయం



**బిట్రగుంట, జనవరి 28 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, సీనియర్ వైసిపి నేత దివంగత తూపిరి పెంచలయ్య సేవలు చిరస్మరణీయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం రాత్రి స్వర్గీయ తూపిరి పెంచలయ్య సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను రాజకీయంలోకి వచ్చినప్పటి నుండి తూపిరి పెంచలయ్యతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఆది నుంచి పెంచలయ్య కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేశారని అయితే మారిన రాజకీయ పరిస్థితుల వల్ల తనతో పాటు వైసిపిలో చేరి చనిపోయేంత వరకు మండల పార్టీ గౌరవాధ్యక్షులుగా పనిచేశారన్నారు. ముక్కుసూటిగా పనిచేస్తూ తనకు మండలంలో అండదండలుగా వున్న పెంచలయ్య మృతి పార్టీతో పాటు తనకు వ్యక్తిగతంగా లోటన్నారు. పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ మాట్లాడుతూ పెంచలయ్య వివాదరహితుడని అందరితో సఖ్యతగా మెలుగుతూ వున్న వ్యక్తిని కోల్పోవడం మండలానికి తీరని లోటు అన్నారు. వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు యాదవ్ మాట్లాడుతూ తనకు రాజకీయ జన్మనిచ్చిన గురువును కోల్పోవడం చాలా బాధ కలిగిస్తుందన్నారు. అంతకుముందు వీరు పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు సంతాపంగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి పులిగండ్ల శ్రీరాములు, నాగులవరం సొసైటీ అధ్యక్షులు సుంకే మాల్యాద్రినాయుడు, టిడిపి మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నేతలు టి.రమణయ్యానాయుడు, పత్రి అంకులయ్య, ఎంపిటిసి ఎ.కె.సుందర్‌రాజ్, పలు గ్రామాల నుండి పార్టీలకతీతంగా వచ్చిన పెంచలయ్య అభిమానులు పాల్గొన్నారు.

## పొంగళ్ళ వేడుకల్లో పాల్గొన్న టిడిపి నేత కావ్య కృష్ణారెడ్డి



**కావలి, జనవరి 28 ప్రభాతవార్త** రజకుల కులదైవం మడియాల స్వామి పొంగళ్ళ వేడుకలలో కావ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్. పారిశ్రామికవేత్త, టిడిపి నేత డి.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు. కావలి పట్టణంలోని 16వ వార్డు బాలకృష్ణారెడ్డినగర్‌లో ఆదివారం మడియాల స్వామిని కావ్య కృష్ణారెడ్డిని దర్శించుకున్నారు. ఆయనకు రజర సోదరీమణులు హారతులు పట్టి స్వాగతం పలికారు. కృష్ణారెడ్డి రాకతో రజక సోదరులు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ వార్డులోని రజకుల నివాసాలకు ఆయన వెళ్లి పలకరించారు. ప్రతి నివాసంలో రజకులు ఆయనను సత్కరించారు.

## ఫైరింగ్ రేంజ్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబరిచిన సిఐ వి.గిరిబాబు



**ఉదయగిరి,జనవరి28,ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిసర్కిల్ ఇన్స్పెక్టర్ వేల్పుల గిరిబాబుకు ఫైరింగ్ పొజిషన్ ప్రతిభ అవార్డు దక్కింది.జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.ఎస్పీ కార్యాలయంలో జరిగే ఫైరింగ్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబరిచిన అధికారులకు ఈ అవార్డులు దక్కుతాయని సిఐ వి.గిరిబాబు తెలిపారు.ప్రతినెలలో ఒకసారి ఎస్పీ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని ప్రతిభ కనబరిచిన ఉత్తమ అధికారులను ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఉదయగిరిలో సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ,ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా లక్ష్యాలవైపు దూసుకుని వెళ్తున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.గిరిబాబును ఉదయగిరి ప్రజలు అభినందించారు.

## వెంగల్‌రావునగర్‌లో ఘనంగా ముగిసిన క్రికెట్ పోటీలు



**ఉదయగిరి,జనవరి28,ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని వెంగల్‌రావునగర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు నేడు ఫైనల్స్‌కు వచ్చాయి.ఆద్యాంతం ఉత్కంఠపోరుగా సాగిన ఈ మ్యాచ్‌లో వెంగల్‌రావునగర్‌కు చెందిన నాగార్జున కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టుకు ప్రథమ బహుమతి దక్కింది.రన్నరప్ బహుమతిని కిషోర్ ఆధ్వర్యంలోని జట్టు దక్కించుకుందని నిర్వహకులు తెలిపారు.మొదటి బహుమతి 25,116ల నదును టిడిపి యువనాయకులు,కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్‌అందజేశారు.రెండవ బహుమతిని ఉదయగిరి బిజెపి నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి 15,116లను అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి యువనాయకులు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో త్వరలో విద్యార్థులకు ఉచిత ట్యూషన్ క్లాసులను ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు.నియోజకవర్గంలోని ప్రజలు పిల్లలకు ఉచితంగాట్యూషన్ క్లాసులు కానీ,ఏదైనా సమస్యకు సంబంధించి తనకు తెలియజేసినట్లు అయితే అందుకు తగిన సహాయాన్ని అందిస్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.గండిపాలెంలోని ఎంపీపీ స్కూల్లో ఉన్న మరుగుదొడ్ల రిపేర్‌కు ఆర్థిక సహాయం కావాల్సిందిగా క్రికెట్ నిర్వహకులు కోరగా రామేష్‌రెడ్డి తక్షణ సహాయం కింద 5వేల రూపాయలు అందించడం జరిగిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎస్‌కె రియాజ్,ఎస్‌కె భాషా,గాపల్లి తిరుపతయ్య,గురవయ్య,నవీన్,లక్ష్మయ్య, రామయ్య ,సిహెచ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెనిద్రలో 3వ రోజు

**ఇందుకూరుపేట, జనవరి 28, ప్రభాతవార్త** మండలంలోని వర్తిపాలెంలో పెన్న పొర్లుకట్టను గుడి హరికుమార్ పరిశీలించారు. 2021 నవంబర్ 21 అర్థరాత్రి కట్ట తెగడంతో కొన్ని వందల కొట్లు రూపాయలు నష్టపోయిన ప్రజలు, అయినా నాసిరకంగానే పొర్లును కట్ట నిర్మించాలన్నారు. గ్రామస్తులకు ఓటు విలువ తెలియజేస్తూ తమ సమస్యలు అడిగి తెలుసుకుంటూ పాదయాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. త్వరలోనే పరిష్కార దిశగా అడుగులు వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల కృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మల్లికార్జున, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీతారామపురం నుండి నెల్లూరు భారీగ తరలిన టిడిపి శ్రేణులు



**సీతారామపురం జనవరి 28 ప్రభాతవార్త** టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు ఆదివారం నెల్లూరు సిటీలో నిర్వహించిన రా.... కదలిరా... భారీ బహిరంగా సభకు ఉదయగిరి నియోజవకర్గ మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్‌చార్జి బొల్లినేని రామారావు ఆదేశాల మేరకు మండల టిడిపి సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాసులు పిలుపు మేరకు మండలం నుండి టిడిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.సుమారు 50 వాహనాలలో 5 వందల మంది టిడిపి కార్యకర్తలు,నాయకులు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు,మండల టిడిపి సీనియర్‌నాయకులు గాజులపల్లి చంద్రారెడ్డి,వెంగలశెట్టి వెంకటేశ్వర్లు,చెన్నకేశవులు,ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ యువనాయకుడు ఆలూరు శ్రీనివాసులు తదితరులు పాల్గోన్నారు.

## సముద్ర గర్భంలో చేపల ఉత్పత్తి

**తోటపల్లిగూడూరు, జనవరి 28, ప్రభాతవార్త** మండలంలోని కొత్త కోడూరు గ్రామానికి చెందిన కావల్ రెడ్డి నిశాంత్‌రెడ్డి ఆక్వా రంగంలో నూతన టెక్నాలజీతో ఈయన కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగిన యువకుడు, కొత్త కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టి తమ ప్రాంతంలో మత్స్యకార సంక్షేమానికి పాటు పడాలన్నా తపన ఆయనలో ఎక్కువ గతంలో కూడా తన సొంత పొలంలో ఆక్వా రంగంలో నూతన టెక్నాలజీ తీసుకొనివచ్చి కేంద్ర మంత్రులను మత్స్యశాఖ ఉన్నతాధికారులను తీసుకొచ్చి ప్రశంసలు పొందారు. ఈ కోవలో సముద్ర గర్భంలో చేపల ఉత్పత్తి పథకం రూపొందించేందుకు ప్రయోగాత్మకంగా సికేజ్ ఫామింగ్ చేపట్టారు. దీని ద్వారా చేపట్టిన ప్రయోగం విజయవంతం, అయితే ఈ తీర ప్రాంత మత్స్యకారులకు చేపల కొరత తీరడంతో పాటు, నిషేధిత సమయంలో కూడా ఆర్థిక ఉపాధికి అవకాశాలు అధికంగా ఉంటాయని చెప్పారు. ఈ ప్రాజెక్ట భారీ వ్యయంతో కకూడినది, మత్స్యకారుల సంపూర్ణ సహకారంతో ఈ ప్రయోగం విజయవంతానికి సహకరించాలని ఆయన కోరారు. తన స్వగ్రామం కోడూరు దేశంలో మంది గుర్తింపు తేవాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలలిపారు. మత్స్యకారులతో సమావేశం నిర్వహించి వారి భయ సందేహాలు నివృత్తి చేస్తామని నిషాత్‌రెడ్డి తెలిపారు.

## వేలాది మందికి సున్నపుబట్టి వద్ద భోజన ఏర్పాట్లు చేసిన మాలేపాటి



**కావలి, జనవరి 28 ప్రభాతవార్త** రా కదలిరా టిడిపి బహిరంగ సభ అనంతరం సున్నపుబట్టి వద్ద టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు వేలాది మందికి ఆదివారం భోజన ఏర్పాట్లు చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సభ పూర్తయిన అనంతరం కావలి నియోజకవర్గానికి సంబంధించిన వేలాది మందికి మాలేపాటి భోజన సదుపాయాలు కల్పించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అనంతరం అక్కడ పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్‌తో చర్చలు జరిపారు. ఈ చర్చలు టిడిపి నేతల సమక్షంలో జరగడంతో ఆసక్తికరంగా మారాయి. మాలేపాటి సోదరుడు రవీంద్రనాయుడు, నియోజకవర్గంలోని టిడిపి నేతలు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆసరా మహిళల అభివృద్ధికి తోడ్పాటు



**కలువాయి జనవరి 28 ప్రభాత వార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా పొదుపు సంఘటా మహిళలకు ఆర్థికంగా వారి అభ్యున్నతికి ఎంతో తోడ్పాటు ఇస్తుందని వెంకటగిరి నియోజకవర్గం నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.కలువాయిలో ఆదివారం బి.వి.ఎన్ ఆర్ జడ్‌పి హైస్కూల్ నందు వైఎస్ఆర్ ఆసరా 4 విడత సదస్సును నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గోన్న రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా ఇచ్చిన హామిలను నెరవేర్చే కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా రుణాలను నాలుగు విడతలలో మాఫీ చేయడం జరుగుతుందని హామి ఇచ్చారు.ఈక్రమంలో నాలుగో విడత మాఫీ చేస్తు మండలంలో 7 వేల 119 మంది సభ్యులకు 4.77 కోట్లు లబ్ది చేకూరే విధంగా నేరుగా లబ్దిదారుల ఖాతల నందు జమ చేయడం జరిగిందని అన్నారు. అదే విధంగా ఆసరాకు 25 వేల 650 కోట్లను జగన్‌మోహన్‌రెడ్డి డి.బిటి ద్వారా అక్కా చెల్లెమ్మల అకౌంట్‌లో జమ చేయడం జరిగిందని అన్నారు. అనంతరం లబ్దిదారులకు 4.77 కోట్ల చెక్కును నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ప్రజాప్రతినిధులు లబ్దిదారులు జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈకార్యక్రమంలో డ్వామా పీడి సాంబశివారెడ్డి, జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మాకిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి,ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి, పిఎసిఎస్ అద్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి,వైస్ ఎంపిపి పంగా పెంచల నరసారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ మాదాస్ యజ్ఞపవన్, కో ఆప్షన్ సభ్యులు రఫీ, ఎపిఎం స్రవంతి, సంబందిత అధికారులు,ప్రజాప్రతినిదులు,వైసిపినాయకులు పెద్దఎత్తున మహిళలు పాల్గోన్నారు.

## దువ్వూరులో వైభవంగా గంధమహోత్సవం



**సంగం జనవరి 28 ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిష్టి రహమతుల్లా అలై అజ్మీరీ వారి గంధమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆస్తానా ఏ నూరియాలో హజరత్ షేక్ భాషాసాహెబ్ నూరి ఆద్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాల నడుమ గంధమహోత్సవం నిర్వహించారు. గంధం ఆస్తాన ఏ నూరియాకు చేరుకున్న అనంతరం ముస్లీం మత పెద్దలు పాల్గోని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రంధమహోత్సవాన్ని తిలకించారు. గంధమహోత్సవాన్నికి వచ్చిన భక్తులకు గ్రంధాన్ని పంచిపెట్టి ప్రసాదాలు అందజేశారు. గంధమహోత్సవం సందర్భంగా మద్యహ్నాం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్ధాన ఏ నూరియా కమీటి సభ్యులు,భక్తులు తదితరులు పాల్గోన్నారు.

## మడమనూరు వైకాపా నేతకు మంత్రి పరామర్శ



**మనుబోలు, జనవరి 28, ప్రభాతవార్త** మండలంలోని మడమనూరు గ్రామంలో సీనియర్ వైకాపా నాయకుడు కొండూరు రామచంద్రారెడ్డిని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రతి వర్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. కొండూరు రామ చం ద్రారెడ్డి తల్లి అయిన సరోజన మ్మ(94) ఆదివారం ఉదయం మరణించారు. ఈ సమాచారం అందుకున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మడమనూరు ఆయన నివాసానికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి నివాళులరినపంచారు. ఈ సందర్భంగా కొండూరు రామచంద్రాంరెడ్డిని పరామర్శించి ఓదార్చారు. మంత్రి వెంట ఆ గ్రామ వైకాపా నాయకులు, సొసైటీ ప్రెసిడెంట్ మారంంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కొండూరు జనార్ధన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మనుబోలు ఉప సర్పంచ్ కడివేటటి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా యువనాయకుడు ముంగర రవీంద్రరెడ్డి, అక్కంపేట మాజీ సర్పంచ్ వైకాపా యువ నేత నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.